# మళ్లీ వీఆర్వో వ్యవస్థ!

మొదటిపేజీ తరువాయి...

ఇచ్చినోళ్లకే పనయ్యేది. పేద రైతులు పదులసార్లు ప్రదక్షిణలు చేసినా పట్టించుకోని పరిస్థితి. రైతులకు ఈ దుస్థితిని దూరం చేసేందుకు 2020లో నాటి కేసీఆర్ ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థను రద్దు చేసింది. గ్రామ రెవెన్యూ అధికారులను ఇతర ప్రభుత్వ శాఖల్లోకి సర్దుబాటు చేసింది. దీంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి. ఆ నాటి నుంచి రైతులపై, భూములపై వీఆర్వోల అజమాయిషీ లేదు. కంప్యూటర్‌లో ఒక్కసారి భూమి వివరాలు నమోదైతే మార్చే ప్రసక్తే లేదు. ఫలితంగా రైతుల్లో భరోసా పెరిగింది. కానీ.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ వీఆర్వో వ్యవస్థను తెరమీదకి తెచ్చింది. భూభారతి చట్టం ద్వారా ప్రతి గ్రామానికి ఓ రెవెన్యూ అధికారిని నియమించనున్నది. పాత వీఆర్వోలు, వీఆర్ఏలనే మళ్లీ రెవెన్యూ శాఖకు తీసుకొచ్చి వీఆర్వోలుగా నియమిస్తామని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. దీంతో రైతుల్లో మళ్లీ ఆందోళన మొదలైంది. మళ్లీ రాత్రికి రాత్రే తమ తలరాతలు ఎక్కడ మారిపోతాయో అని భయపడుతున్నారు.

### రాత్రికి రాత్రే రికార్డులు తారుమారు

గతంలో మ్యాన్యువల్ పద్ధతిలో భూ రికార్డుల నిర్వహణ జరిగినప్పుడు వీఆర్వో రాసిందే రాత.. గీసిందే గీత అన్నట్టుగా సాగేది. లంచం ఇచ్చినవాళ్లకు, పైరవీలు చేసుకున్నవాళ్లకు రికార్డుల్లో కాస్తు కాలమ్‌లో పేర్లు నమోదయ్యేవి. ఆ తర్వాత వారినే యజమానులుగా మార్చి పట్టాలు మంజూరు చేసేవారు. ఇందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయి. సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములకు 1995లో తండ్రి నుంచి వారసత్వంగా చెరో 2.03 ఎకరాల భూమి వచ్చింది. 2000 సంవత్సరంలో తమ్ముడి భూమిని అన్న కొనుగోలు చేశాడు. రికార్డుల్లో పేరు మార్చాలని వీఆర్వోకు దరఖాస్తు చేసుకున్నాడు. ఇందుకు రూ.5 వేలు లంచం డిమాండ్ చేయగా.. ఆ రైతు ఇవ్వలేదు. 2018లో భూ రికార్డుల ప్రక్షాళన తర్వాత ఆ రైతు పేరుమీద 4.06 ఎకరాలకు బదులు 0.3 గుంటల భూమి మాత్రమే ఉన్నది. దీంతో ఆ రైతు లబోదిబోమన్నాడు. లంచం అడిగితే ఇవ్వలేదని వీఆర్వో తన భూమిని వేరే వ్యక్తుల పేర్లమీదికి మార్చాడని ఆరోపించారు. 'పొరబాటున ఆ భూమి వేరే రైతు పేరుమీదికి మారింది' అంటూ ఆ వీఆర్వో చావుకబురు చల్లగా చెప్పాడు. ఇలాంటి సంఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నాయి. ఏదైనా అత్యవసరమై రైతులు తమ భూమిని అమ్ముకోవాలని చూసినప్పుడు రికార్డులు తారుమారైన ఘటనలు వెలుగులోకి వచ్చేవి. దీంతో మళ్లీ అదే వీఆర్వోకు అడిగినంత ముట్టజెప్పి, పై అధికారుల కాళ్లావేళ్లా పడి అడిగినంత సమర్పించుకొని పట్టా మార్పించుకోవాల్సిన పరిస్థితులు ఉండేవి. కొన్నిసార్లు ఎంత ప్రయత్నించినా రికార్డులు మారకపోవడంతో రైతులు ఆత్మహత్యలకు ప్రయత్నించిన ఉదంతాలు కూడా ఉన్నాయి. పట్టా భూములే కాకుండా వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు, దేవాదాయ శాఖ భూములు అన్యాక్రాంతం కావడంలో వీఆర్వోలు కీలక పాత్ర పోషించారన్న ఆరోపణలున్నాయి. రైతులు, స్వాతంత్ర్య సమరయోధులు, సైనికులు అన్ని వర్గాల భూ యజమానులు వీఆర్వోల బాధితులే.




### విచ్చలవిడి అవినీతికి కేరాఫ్

వీఆర్వో వ్యవస్థ గతంలో విచ్చలవిడి అవినీతికి కేరాఫ్‌గా ఉండేది. డబ్బులు ఇస్తేనే పెన్ను ముట్టే పరిస్థితి. క్రయవిక్రయాలు నమోదు కావాలన్నా, 1బీ కావాలన్నా, పాస్‌బుక్ రావాలన్నా.. ఇలా ఏ పని అయినా లంచం ఇవ్వాల్సిందే. ఏ పనికి ఎంత అన్నది ఫిక్స్ చేసేవారు. 'పాస్‌బుక్ ఇవ్వాలంటే ఒక్కో రైతు రూ.లక్ష ఇవ్వాలని వీఆర్వో డిమాండ్ చేస్తున్నాడు' అంటూ 2019లో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం నెర్రవల్లి రైతులు తాసిల్దార్‌కు ఫిర్యాదు చేశారు. నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలంలోని ఓ వీఆర్వో కొత్త పాస్‌బుక్‌లు, పట్టామార్పిడి కోసం రైతుల నుంచి భారీగా వసూళ్లు చేశాడు. ఒరిజినల్ డాక్యుమెంట్లు తీసుకున్నాడు. ఆ తర్వాత దాదాపు 10 నెలలపాటు పత్తాలేకుండా పోయాడు. దీనిపై బాధిత రైతులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం కనిపించలేదు. ఇవి కేవలం ఉదాహరణలు మాత్రమే. ఇలాంటివి ప్రతి రైతుకు ఒక అనుభవమే. ఒకప్పుడు ఏసీబీ నమోదు చేసిన కేసుల్లో రెవెన్యూ శాఖ టాప్‌లో ఉండగా, పట్టుబడినవారిలో ఉన్నతాధికారులతో సమానంగా వీఆర్వోలు ఉండేవారు. వారి వద్ద రూ.కోట్లలో అక్రమాస్తులు బయటపడేవి.

### మళ్లీ పాత వీఆర్వోలకు పిలుపు

కాంగ్రెస్ ప్రభుత్వం 2020 ఆర్వోఆర్ చట్టాన్ని రద్దు చేసి, కొత్తగా భూభారతి బిల్లును అసెంబ్లీలో ఆమోదింపజేసిన విషయం తెలిసిందే. దీని ప్రకారం ప్రతి గ్రామానికి ఒక వీఆర్వోను నియమించనున్నారు. వీరికి మళ్లీ భూ రికార్డుల నిర్వహణ బాధ్యతలు అప్పగించనున్నారు. అందుకోసం కొత్త నియామకాలు చేపట్టకుండా పాత వీఆర్వోలు, వీఆర్ఏలనే నియమిస్తామని ప్రభుత్వం చెప్తున్నది. ఇప్పటికే ఆప్షన్లు కూడా తీసుకుంటున్నారు. దీంతో రైతుల్లో మళ్లీ ఆందోళన మొదలైంది. తమ భూములపై మళ్లీ వీఆర్వోల పెత్తనం మొదలవుతుందని, పాత రోజులు మళ్లీ వస్తాయని బిక్కుబిక్కు మంటున్నారు.

### రద్దుతో సంబరం

వీఆర్వో వ్యవస్థ చేస్తున్న దారుణాలను గమనించిన కేసీఆర్ ప్రభుత్వం 2020లో సాహసోపేత నిర్ణయం తీసుకున్నది. వీఆర్వో వ్యవస్థను రద్దు చేసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా రైతులు సంబరాలు చేసుకున్నారు. తమ భూములపై ఇతర వ్యక్తుల పెత్తనం పోయిందని ఆనందపడ్డారు. 2020లో తెచ్చిన కొత్త రెవెన్యూ చట్టంతో రికార్డులు కంప్యూటర్‌లోకి వెళ్లాయి. భూ క్రయవిక్రయాలన్నీ ఆన్‌లైన్‌లోనే సాగాయి. రికార్డులు సరళతరం అయ్యాయి. దీంతో గ్రామాల్లో భూ రికార్డుల నిర్వహణ అవసరం లేకుండా పోయింది. వీఆర్వోలకు పనిలేకుండా పోయింది. అందుకే ఆ వ్యవస్థను రద్దు చేశామని నాటి సీఎం కేసీఆర్ చెప్పారు.

## సర్వేయర్లుగా వీఆర్వోలను నియమిస్తారా?

- అవగాహన లేనివారిని నియమిస్తే సమస్యలు
- ప్రభుత్వం పునరాలోచించాలని సర్వేయర్ల డిమాండ్

ఖలీల్‌వాడి, డిసెంబర్ 27: అవగాహన లేని వారిని సర్వేయర్లుగా నియమిస్తే ఊరుకునేది లేదని, ఆందోళనలు చేస్తామని ప్రభుత్వ సర్వేయర్లు హెచ్చరించారు. నిజామాబాద్ జిల్లాలో సర్వే ల్యాండ్ రికార్డ్స్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న సర్వేయర్లు శుక్రవారం జిల్లా కేంద్రంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూమాత అమలుపై, సర్వేఅండ్ ల్యాండ్ రికార్డ్స్ డిపార్ట్‌మెంట్‌లో నూతనంగా చేపట్టనున్న నియామకాలపైనా చర్చ జరిగింది. తెలంగాణ గెజిటెడ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ మాట్లాడుతూ.. సర్వేయర్లను నియమిస్తామన్న ప్రభుత్వ ప్రకటనను స్వాగతిస్తున్నామన్నారు. గతంలో పనిచేసిన వీఆర్వోలకు అవకాశం కల్పిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి ప్రకటించడంపై అభ్యంతరం తెలిపారు. ఎలాంటి టెక్నికల్ నాలెడ్జ్ లేని వారిని నియమిస్తే ఇబ్బందులు తలెత్తుతాయని చెప్పారు. ప్రభుత్వం భూసమస్యలు లేకుండా చేస్తానని చెబుతూనే, కొత్త సమస్యలు సృష్టించడం సరికాదని చెప్పారు. కర్ణాటకలో చేపట్టిన విధానాన్ని ఇక్కడా అమలు చేస్తామనడం సరికాదన్నారు.

## పార్టీ కోసం కష్టపడే వారికి గుర్తింపు లేదు

**ఎన్ఎస్‌యూఐ నేత నిరంజన్‌బాబా**

వనపర్తి టౌన్, డిసెంబర్ 27 : కాంగ్రెస్ పార్టీలో పనిచేసే వారికి సముచిత స్థానం లేదని ఎండీ నిరంజన్ బాబా శుక్రవారం తీవ్ర మనస్తాపంతో మీడియా ముందు ఆవేదన వెలిబుచ్చారు. ఎన్ఎస్‌యూఐ కార్యకర్తగా, జిల్లా , యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా .. పార్టీ అభివృద్ధి కోసం 18 ఏండ్లుగా పని చేసినా ఎలాంటి పదవి లభించలేదని వాపోయారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పార్టీ పదవులకు అర్హులం కాదా..? అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో పనిచేయని నాయకులకు పదవులు వస్తున్నాయని, ఇదెక్కడి న్యాయమని నిలదీశారు. వనపర్తి కోర్టులో న్యాయవాదిగా చాలాకాలంగా పనిచేస్తున్నా.. కోర్టులో అదనపు గవర్నమెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏజీపీ) పదవి ఆశించినా తనకు దక్కకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైనట్టు చెప్పారు.


నాగర్‌కర్నూల్ జిల్లా నేరళ్లపల్లిలో మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌రెడ్డి తండ్రి జంగిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ సంతోష్‌కుమార్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి,

## మర్రిని పరామర్శించిన సంతోష్

- జంగిరెడ్డి చిత్రపటం వద్ద మాజీ ఎంపీ నివాళి

తిమ్మాజిపేట, డిసెంబర్ 27 : తండ్రిని కోల్పోయిన నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిని మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ పరామర్శించారు. శుక్రవారం తిమ్మాజిపేట మండలం నేరళ్లపల్లికి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి వెళ్లిన ఆయన మర్రి తండ్రి జంగిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీ మలోతు కవిత మర్రిని పరామర్శించారు.

## వీఆర్వోలు, వీఆర్ఏలు నాట్ విల్లింగ్!

- వెనక్కి వచ్చేందుకు నేటితో ముగియనున్న గడువు
- సర్వీస్ రూల్స్ లేకపోవడంతో తర్జన భర్జన

హైదరాబాద్, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ): గ్రామాల్లో కొత్తగా వీఆర్వోలుగా పని చేసేందుకు పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలు పెద్దగా ఆసక్తి కనబరచడం లేదని రెవెన్యూవర్గాలు చెప్తున్నాయి. ఇతర శాఖల్లో పనిచేస్తున్న పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలు తిరిగి వచ్చేందుకు విల్లింగ్ ఇవ్వాలని సీసీఎల్ఏ ఇటీవల ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ గడువు శనివారంతో ముగియనున్నది. రాష్ట్రవ్యాప్తంగా 10,434 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఒక్కో గ్రామానికి ఒక వీఆర్వోను నియమించాలని, మరో వెయ్యి మందిని సర్వేయర్లుగా తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. దాదాపు 11,500 మందిని తిరిగి రెవెన్యూ శాఖలోకి తేవాలని భావించింది. గతంలో ఇతర శాఖల్లోకి సర్దుబాటు అయిన వీఆర్వోలు, వీఆర్ఏలు కలిపి దాదాపు 24 వేల మంది వరకు ఉన్నారు. దీంతో కుప్పలుతెప్పలుగా దరఖాస్తులొస్తాయని ప్రభుత్వం భావించింది. ప్రభుత్వం అంచనాలను తలకిందులు చేస్తూ ఇప్పటివరకు 3,500 మంది వరకు మాత్రమే విల్లింగ్ ఇచ్చినట్టు రెవెన్యూ వర్గాలు తెలిపాయి. నూతన వీఆర్వో వ్యవస్థకు సంబంధించి సర్వీస్ రూల్స్ నిర్ధారణ కాకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా చెప్తున్నారు. 'ముందు చేరండి.. ఆ తర్వాత బాధ్యతలు, సర్వీస్ నిబంధనలు తెలుస్తాయి' అంటూ ఉన్నతాధికారులు చెప్తున్నారట. అసలు తమ పని ఏమిటో తెలియకుండా ఎందుకు వెళ్లాలని పాత వీఆర్వోలు, వీఆర్ఏలు భావిస్తున్నారు. పైగా గతంలో కన్నా అధికారాలు తక్కువగా ఉండటం కూడా మరో కారణంగా చెప్తున్నారు. విద్యార్హతలు వంటి సాంకేతిక అడ్డంకులు ఉండటంతో సర్వేయర్ పోస్టులో చేరేందుకు వెనుకంజ వేస్తున్నట్టు సమాచారం.


అలంపూర్‌లోని జోగుళాంబ ఆలయంలో జడ్జి కుటుంబ సభ్యులు, అధికారులు

## జోగుళాంబ సన్నిధిలో సుప్రీంకోర్టు జడ్జి

అలంపూర్, డిసెంబర్ 27 : అష్టాదశ శక్తిపీఠాల్లో ఐదో శక్తి పీఠమైన అలంపూర్‌లోని జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను శుక్రవారం సుప్రీంకోర్టు జడ్జి ఎస్వీఎన్ భట్టి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ పాలక మండలి కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ఈవో పురేందర్‌కుమార్ స్వాగతం పలికి, జోగుళాంబ జ్ఞాపికను అందజేశారు. వారి వెంట గద్వాల డీఎస్పీ సత్యనారాయణ, అలంపూర్ సీఐ రవిబాబు, ఎస్సై వెంకటస్వామి, తాసీల్దార్ మంజుల ఉన్నారు.

## ఈ ఏడాది 41 రోజులు భారీ ఎండలు

వాషింగ్టన్, డిసెంబర్ 27: ఈ ఏడాది ఎండలు మండిపోయాయని.. వాతావరణ మార్పుల వల్ల సగటున 41 రోజులు అదనంగా ఎండలను భరించాల్సి వచ్చిందని శాస్త్రవేత్తలు తెలిపారు. మానవ కార్యకలాపాల వల్ల పెరుగుతున్న వాతావరణ మార్పులపై పరిశోధన చేసిన సైంటిస్టులు గత అధ్యయనాల ఆధారంగా ఈ విషయాలను వెల్లడించారు. 'ఈ పరిణామం ఆశ్చర్యం కలిగించకపోయినా ఆందోళనకరం. వాతావరణ మార్పుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా లక్షలాది ప్రజల జీవితాలు, జీవనోపాధులు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి' అని వరల్డ్ వెదర్ అట్రిబ్యూషన్ అండ్ యాన్ ఇంపీరియల్ కాలేజ్ వాతావరణ శాస్త్రవేత్త ఫ్రెడరిక్ ఒట్టో అన్నారు.

## ప్రభుత్వ వైద్యశాలకు 'స్వచ్ఛంద' చేయూత

పెనుబల్లి, డిసెంబర్ 27: 'సమరిటన్స్ ఫర్ ది నేషన్' అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పెనుబల్లి ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు ఉపయోగపడే సామగ్రిని శుక్రవారం అందజేశారు. డీఎల్ఐసీ లైయన్స్ క్లబ్, డాల్స్, టెక్సాస్ అండ్ ఆర్వీ ప్రసాద్ సంస్థల ఆధ్వర్యంలో రూ.1.50లక్షలు విలువ చేసే ఓటీ డూట్ లైట్, ఫాగ్‌మిషన్, వీల్‌చైర్స్‌ను స్వచ్ఛంద సంస్థ అధినేత రాంకుమార్, సభ్యులు ఆర్వీ.ప్రసాద్, దామోదర్‌లు ఆసుపత్రి సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ వరుణ్, డాక్టర్ కిరణ్‌కుమార్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## 30న దేశవ్యాప్త నిరసన

సత్తుపల్లిటౌన్, డిసెంబర్ 27: ఇటీవల పార్లమెంట్ సమావేశాల్లో అంబేద్కర్‌ను ఉద్దేశించి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఈ నెల 30న వామపక్షాల ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాదినేని రమేశ్ తెలిపారు. శుక్రవారం సత్తుపల్లిలోని రావి వీరవెంకయ్య భవన్‌లో డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. అమిత్‌షాను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేస్తూ ఆయనపై ఛార్జ్‌షీట్ ఓపెన్ చేయాలన్నారు. 30న జరిగే నిరసన కార్యక్రమాల్లో మతాలు, కులాలు, రాజకీయాలకు అతీతంగా ఇతర బూర్జువ పార్టీలు, మేధావులు, విద్యావంతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు శీలం సత్యనారాయణరెడ్డి, మోరంపూడి పాండురంగారావు, రావుల రాజబాబు, కొలికపోగు సర్వేశ్వరరావు, భాస్కర్ పాల్గొన్నారు.

## చోరీ కేసు నమోదు

మామిళ్లగూడెం, డిసెంబర్ 27 : ఖమ్మం నగరంలోని శ్రీనివాసనగర్ ప్రాంతంలో మూడు ఇళ్లల్లో చోరీ జరిగినట్లు ఖమ్మం మూడో పట్టణ పోలీసులు శుక్రవారం తెలిపారు. స్థానికంగా ఒకే ప్రాంతంలో పక్క పక్క నివాసాల్లో దుండగులు చోరీలకు ప్రయత్నించారని, ఓ ఇంట్లో ల్యాప్‌టాప్, నగదు, మరో నివాసంలో ద్విచక్రవాహనం, నగదు, చోరీకి గురైనట్లు తెలిపారు. ఈ ఘటనపై స్థానిక భరత్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. కాగా ఇదే ప్రాంతంలో ఇద్దరు యువకులు విడివిడిగా చోరీలకు ప్రయత్నించిన వీడియోలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. అవి సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. రాత్రి సమయంలో పెట్రోలింగ్ పెంచి నిఘా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరతున్నారు.

# తెరుచుకోని 'క్రెష్'!

- భద్రాద్రి కొత్తగూడెం ఐడీవోసీలో మూలనపడ్డ సెంటర్
- మహిళా ఉద్యోగుల పిల్లలకు కరువైన ఆలనాపాలన
- ఆరు నెలలు గడవక ముందే గదికి తాళం వేసిన వైనం

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): సమీకృత కలెక్టరేట్‌లోని వివిధ శాఖల్లో విధులు నిర్వర్తించే మహిళా ఉద్యోగినుల పిల్లల కోసం ఏర్పాటు చేసిన క్రెష్ సెంటర్ మూలనపడింది. సెంటర్‌ను ప్రారంభించి ఆరు నెలలు గడవక ముందే తాళంతో దర్శనమిస్తున్నది. గత కేసీఆర్ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే దగ్గర ఉండే విధంగా.. ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేసే విధంగా సమీకృత కలెక్టరేట్ భవనాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో ప్రభుత్వ కార్యాలయాల్లోని పలు శాఖల్లో పనిచేసే మహిళా ఉద్యోగినుల చంటి పిల్లలను ఇంటి వద్ద ఎవరూ చూసుకునే వీలు లేని వారు తమతోపాటు పిల్లలను తీసుకొచ్చి క్రెష్ (శిశువులను పగటి పూట జాగ్రత్తగా చూసే స్థలం) సెంటర్‌లో వదిలేవారు. అయితే అది ప్రారంభించి ఆరు నెలలు గడవక ముందే దానికి తాళం పడింది. ప్రస్తుతానికి గది ఆవరణ చుట్టూ చెత్తాచెదారంతో నిండిపోయింది.


ఐడీవోసీలో తాళం వేసిన క్రెష్ సెంటర్

### ఉద్యోగినుల పిల్లల పాలన ఎలా?

ప్రతీ ప్రభుత్వ శాఖలో మహిళా ఉద్యోగినులు ఉంటారు. వారి పిల్లల కోసం ప్రభుత్వం క్రెష్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. కానీ.. ప్రస్తుతానికి ఆ సెంటర్ మూతపడడంతో ఉద్యోగినుల పిల్లలు ఇంటికే పరిమితమవుతున్నారు. సెంటర్‌లో టీచర్, ఆయాను నియమించకపోవడంతో అది మూతపడినట్లు తెలిసింది. కలెక్టరేట్ ప్రాంగణంలో నిత్యం కలెక్టర్‌తోపాటు జిల్లా అధికారులు ఉండే ప్రదేశంలో ఒక క్రెష్ సెంటర్ మూతపడిందంటే అధికారుల పర్యవేక్షణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

### కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్తాం

గతంలోనే ఐడీవోసీలో క్రెష్ సెంటర్‌ను ప్రారంభించారు. కొత్తగా టీచర్, ఆయాను నియమించలేదు. పాలనా పథకం ద్వారా దానిని మంజూరు చేశారు. దగ్గరలో అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో అక్కడి నుంచి డిప్యూటేషన్ వేయలేదు. కొత్త టీచర్‌ను నియమించాలి. కలెక్టర్ సార్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి టీచర్, ఆయాను నియమిస్తాం.

**- స్వర్ణలత లెనీనా, డీడబ్ల్యూవో**

## ఆర్యవైశ్య మహాసభ క్యాలెండర్ ఆవిష్కరణ

వైరాటౌన్, డిసెంబర్ 27: వైరా మండల, పట్టణ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో 2025 సంవత్సర క్యాలెండర్‌ను ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకుడు వనమా విశ్వేశ్వరరావు శుక్రవారం ఆవిష్కరించారు. ఆర్య వైశ్య కల్యాణ మండపం అధ్యక్షుడు డాక్టర్ పెరుమాళ్ల కృష్ణమూర్తి, మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు నూకల శ్రీనివాసరావు, గజ్జల కృష్ణమూర్తి, కొణతాలపల్లి వెంకటసుబ్బారావు, నూకల ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

## గాయకుడు శంకర్‌కు 'గాన కోకిల' అవార్డు


అవార్డు అందుకుంటున్న ఆదెర్ల శంకర్

కారేపల్లి, డిసెంబర్ 27: మండలానికి చెందిన సామాజిక కార్యకర్త, కళాకారుడు ఆదెర్ల శంకర్‌కు ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ గానకోకిల అవార్డును సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో అందజేసింది. సీపీఐ జాతీయ నాయకుడు చాడా వెంకటరెడ్డి ఆసంస్థ వ్యవస్థాపకుడు మేకల చంద్రశేఖర్, ఉద్యోగ సంఘాల జేఏసీ అధ్యక్షుడు శంకర్‌రావు చేతుల మీదుగా శంకర్ అవార్డును అందుకున్నాడు.

## చట్టాలను అతిక్రమిస్తే వదలొద్దు

**కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్**


అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ

చుంచుపల్లి, డిసెంబర్ 27: చట్టాలను అతిక్రమించిన వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ వదలొద్దని, కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ ఆదేశించారు. చుంచుపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా, కార్యాలయ ఆవరణలో మొక్క నాటారు. అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. కేసుల వివరాలను సీసీటీఎన్ఎస్‌లో పొందుపర్చాలన్నారు. పరిష్కరించాల్సిన కేసులపై సమీక్షించారు. సైబర్ నేరాల వివరాలను తెలుసుకున్నారు. విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సర్కిల్ ఆఫీస్ పరిధిలో అన్ని గ్రామాలకు గ్రామ పోలీస్ అధికారులను కేటాయించాలని ఆదేశించారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు రమణారెడ్డి, రవికుమార్, రమాదేవి, ట్రైనీ ఎస్సై అఖిల పాల్గొన్నారు.


## వ్యక్తిపై దాడి కేసు నమోదు

మామిళ్లగూడెం, డిసెంబర్ 27 : ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటనలో మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం నగరం బల్లేపల్లి ప్రాంతానికి చెందిన ఎరగొర్ల సతీశ్‌పై నాగిశెట్టి సురేందర్ అనే వ్యక్తి దాడి చేసి గాయపరిచాడు. సతీశ్ బావ బుడిగెం శ్రీనివాసరావు బంగారం వ్యాపారం నిర్వహిస్తున్నాడు. శ్రీనివాసరావుకు సురేందర్‌కు వ్యాపార లావాదేవీల విషయంలో గత కొంతకాలంగా మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఇటీవల శ్రీనివాసరావు అనారోగ్యానికి గురికావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే కక్ష పెంచుకున్న సురేందర్ శ్రీనివాసరావును కొట్టేందుకు అతడి ఇంటికెళ్లగా అక్కడ శ్రీనివాసరావు లేకపోవడంతో అక్కడే ఉన్న సతీశ్‌పై దాడి చేశాడు. సతీశ్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ రమేశ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సింగరేణిలో ఇనుము దొంగలు

రామవరం, డిసెంబర్ 27 : సింగరేణి కొత్తగూడెం ఏరియాలో ఇనుము దొంగలు బరితెగిస్తున్నారు. రాత్రికి రాత్రే సింగరేణి ఆస్తులను దోచుకుంటున్నారు. ఇనుము పేరుతో కరంటు పోల్స్‌ను కట్ చేసి మరీ ఎత్తుకుపోతున్నారు. కంచే చేను మేస్తే కాపాడేది ఎవరన్నట్టు ఉంది సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని ఎస్అండ్‌పీసీ లో ఉద్యోగుల తీరు. దొంగతనాలు జరుగుతున్నాయని సమాచారం ఇచ్చే వ్యక్తుల పేర్లను దొంగలకే చెప్తున్నారంటే వారికి వీరికి ఉన్న సంబంధం ఏమిటో స్పష్టం అవుతోంది. దొంగలు. సమాచారం ఇచ్చే వారిపై గొడవగా దిగడం లాంటి సంఘటనలు జరుగుతున్నాయి. రహస్యంగా ఉంచాల్సిన సమాచారాన్ని బహిర్గతం చేయడంతో సమాచారాన్ని ఇవ్వడానికి జంకుతున్నారు. ఎవరిని నమ్మాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు స్థానికులు.

సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ పంచాయతీ పరిధిలోని ఎసేఆర్టీ ఏరియాలో 152 క్వార్టర్లు, 62 సొంతగా నిర్మించుకున్న ఇల్లు, వీకే ఓసీ విస్తరణలో భాగంగా ఆ ప్రాంతంలో ఉన్న వీటిని తొలగించారు. అప్పట్లో క్వార్టర్లలో ఉండే కార్మికుల విద్యుత్ అవసరాల కోసం ఐరన్ పోల్స్‌ను ఏర్పాటు చేశారు. ఇటీవల క్వార్టర్‌లను తొలగించిన నేపథ్యంలో విద్యుత్ తీగెలను తొలగించే విద్యుత్ స్తంభాలను అలానే ఉంచారు. ఈ ప్రాంతంలో జన సంచారం లేకపోవడం, గస్తీ కూడా తిరగకపోవడంతో ఇదే అదునుగా భావించి దొంగలు ఇనుమును కోసేది అందుకు ఉపయోగించే బేళ్లను ఉపయోగించి ఇనుప కరెంట్ స్తంభాలను ముక్కలుగా కోసి అమ్ముకుంటున్నారు. ఇప్పటికే సుమారు 20 పోల్స్ మాయం చేశారు. ఒక్కొక్క పోల్ 11 మీటర్ల ఎత్తు, 115కిలోల బరువు ఉంటుందని స్థానికులు అంటున్నారు.



### కాపాడాల్సినోళ్లు ఏం చేస్తున్నట్లు..?

సింగరేణి సంస్థలోని ఆస్తులను రక్షించేందుకు ఏర్పాటు చేసిన ఎస్అండ్‌పీసీలోని స్పెషల్ టీంలోని ఆరుగురు సభ్యులు, ఇంటిలిజెన్స్ విభాగంలో ఇద్దరు సభ్యులు సంస్థలు ఏం జరిగినా ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఆస్తుల రక్షణలో వీరు ముఖ్య భూమిక నిర్వహిస్తారు. అలాంటి వీరు ఇంత పెద్ద మొత్తంలో ఎస్ఆర్‌టీ ఏరియాలో పైప్‌లైన్‌లు, ఐరన్ విద్యుత్ స్తంభాలు ముక్కలుగా కోసి అమ్ముకుంటూ ఉంటే.. కాపాడాల్సిన వారు ఏం చేస్తున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### సంస్థ ఆస్తుల రక్షణ శూన్యం

లక్షల్లో జీతాలు తీసుకుంటున్నా సంస్థ ఆస్తుల రక్షణలో శూన్యంగానే కనిపిస్తుంది. ఏరియాలో గత కొన్ని రోజులుగా రుద్రంపూర్ ఎస్ఆర్‌టీ ఏరియాలో ఇనుప పోల్స్‌ను కట్ చేస్తూ దొంగతనం చేస్తూ దొంగలు ఛాలెంజ్ విసిరినా ఎస్అండ్‌పీసీ డిపార్ట్‌మెంట్‌లో ఒక ఎస్ఎస్‌వో, ఒక జూనియర్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు జమేదార్‌లు, 40 మంది ఎస్అండ్‌పీసీ గార్డులతో పాటు 142 మంది ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు ఉన్నప్పటికీ సంస్థ ఆస్తులు కాపాడే వారే లేకుండా పోయింది. సంస్థకు చెందిన ఆస్తులను దొంగలు అపహరిస్తుంటే ఇది తమ పరిధి కాదు.. తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో జీకేవోసీలో సింగరేణి గార్డు, చోరులు కలిసి కేబుల్ చోరీకి పాల్పడటం కూడా విదితమే. దానిని గుణపాఠంగా తీసుకోకుండా కొందరు సిబ్బంది దొంగలకు ఎప్పటికప్పుడు సమాచారం అందవేస్తున్నారని, అందువల్లనే వారి పని సునాయాసనంగా జరుగుతోందని ఆరోపణలు కూడా గుప్పుమంటున్నాయి. బుధవారం ఒకేరోజు ఆరు ఇనుప స్తంభాలను కోశారంటే వీరి గస్తీ ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇటు పోలీసులు కూడా గస్తీని నిర్వహించకపోవడంతో వారి పని ఇంకా సులువవుతోంది. ఈ విషయమై ఎస్‌వోటు జీఎం కోటిరెడ్డిని వివరణ కోరగా... తమ దృష్టికి ఈ విషయం వచ్చిందని, వీరికి సాయం చేస్తున్న దానిపైన విచారణ చేస్తున్నామని, అంతేకాకుండా దొంగల పాలైన పోల్లను రికవరీకి కూడా ఆదేశించామని తెలిపారు.

# పర్యాటక కేంద్రంగా 'భద్రాద్రి'

- ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్న కలెక్టర్ పాటిల్
- జిల్లాలోని పలు పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు
- అవగాహన కోసం టూరిస్టు ప్రాంతాల్లో బృందం పర్యటన

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రకృతి సిద్ధంగా వెలసిన అందాలకు తోడు.. వాటిని పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, అక్కడి గిరిజన సంస్కృతీ సంప్రదాయాలను బాహ్య ప్రపంచానికి తెలియజేయడంతోపాటు వాటిని పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసేందుకు కంకణం కట్టుకున్నారు. ఈ క్రమంలో భద్రాచలం ఐటీడీఏ పరిసరాల్లో ఏర్పాటు చేస్తున్న గిరిజన మ్యూజియం, గోదావరి ఘాట్ వద్ద రివర్ సైడ్ క్యాంపింగ్, బుజ్జిగుప్ప గిరిజన గృహాల సందర్శన, బెండాలపాడు, తుమ్మల చెరువు, పూబెల్లిలో పర్యాటక రంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు, ఆయా గ్రామాల సభ్యులకు పర్యాటకరంగా అభివృద్ధి చేయడం కోసం చేపట్టాల్సిన పనులు, అవలంబించాల్సిన పద్ధతులపై మరింత అవగాహన పెంచుకునేందుకు కలెక్టర్ జిల్లా నుంచి కొందరు సభ్యుల బృందాలను వివిధ పర్యాటక ప్రాంతాలకు పంపించారు. బొజ్జిగుప్ప, బెండాలపాడు, భద్రాచలం, పూబెల్లి గ్రామ సభ్యులు, అధికారులు, సిబ్బందితో కూడిన 25 మంది సభ్యుల బృందాన్ని ములుగు జిల్లాలోని పరిసర అటవీ ప్రాంతంలో ఉన్న బ్లాక్ బెర్రీ ఐలాండ్ సందర్శనకు పంపించారు. అలాగే హైదరాబాద్ చౌటుప్పల్‌లో ఉన్న వి లీవ్ ఇన్ బాండ్ నైస్‌ను బృందం సభ్యులు సందర్శించారు. అక్కడ వెదురు ఉత్పత్తులతో తయారు చేసిన వివిధ రకాల వస్తువులు, కళాకృతులు, వెదురు ఇల్లు, ఫర్నిచర్‌ను పరిశీలించి.. వాటిని తయారు చేయడానికి కావాల్సిన నైపుణ్యాన్ని ఉపయోగించే పద్ధతుల గురించి తెలుసుకున్నారు. కేరళ రాష్ట్రం వయనాడ్ జిల్లాలోని ఊరవు వెదురు శిక్షణ కేంద్రాన్ని కూడా బృందం సభ్యులు సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాటన్నింటినీ ఇక్కడి వనరుల ఆధారంగా అభివృద్ధి చేసి.. పర్యాటకుల రద్దీని పెంచేందుకు కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు.


పర్యాటక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న బృందం సభ్యులు